క్లుప్తంగా

విజయవంతంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్



మాట్లాడుతున్న డాక్టర్ మురళీనాథ్

సిద్దిపేటకమాన్: కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఓ పెషేంట్‌కు విజయవంతంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ నిర్వహించినట్లు యశోధ ఆస్పత్రి వైద్యుడు మురళీనాథ్ తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 45 సంవత్సరాల ఓ వ్యక్తి కిడ్నీ సమస్యతో బాధపడుతూ తమను సంప్రదించాడన్నారు. అన్ని రకాల పరీక్షలు నిర్వహించి షుగర్ వల్ల కిడ్నీ పాడైనట్లు గుర్తించామని, అతడి భార్య భవాని కిడ్నీ డొనేట్ చేయడంతో బాధితుడికి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశామని చెప్పారు. పెషేంట్ కోలుకుని పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడని తెలిపారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన



శరీర భాగాలను పరిశీలిస్తున్న చిన్నారులు

వర్గల్(గజ్వేల్): బడిలోనే కాదు పాఠ్యాంశాన్ని క్షేత్ర సందర్శన ద్వారా నేర్పిస్తామంటున్నారు వర్గల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు. శరీరంలోని అవయవాలు, వ్యవస్థలు అనే పరిసరాల విజ్ఞానం పాఠం కోసం ఐదో తరగతి పిల్లలను శుక్రవారం క్షీరసాగర్‌లోని హంస హోమియోపతి మెడికల్ కళాశాలకు తీసుకెళ్లారు. అక్కడి ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థుల సహకారంతో వారు ల్యాబ్‌లు సందర్శించారు. మానవ శరీర భాగాలను ప్రత్యక్షంగా చూసి వాటి విధులు, ఎదిగే తీరు తదితర విషయాలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు కనకయ్య, రజని, మల్లికార్జున్ పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభిస్తున్న ఎంఈఓ

కొండపాక(గజ్వేల్): భవిష్యత్‌లో కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో దోహదపడుతుందని మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొండపాక మోడల్ స్కూల్లో శుక్రవారం కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక విద్యను అందిపుచ్చుకుంటూ ఉన్నతంగా ఎదగాలన్నారు. కంప్యూటర్ విద్యపై ఆసక్తి పెంచుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. వచ్చేది పరీక్షల సమయమన్న విషయాన్ని మర్చిపోవద్దని శ్రద్ధగా చదువుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యజ్ఞశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గౌసేపాక్ బోధనలు ఆచరణీయం



జెండా పండుగలో పాల్గొన్న ముస్లింలు

హుస్నాబాద్: జామా మసీదు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గౌసేపాక్ గ్యార్మి షరీఫ్ జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. జెండాను జామా మసీదు నుంచి ఆలంగీర్ మసీదు వరకు తీసుకువెళ్లి గౌసేపాక్ గద్దె వద్ద జెండాను ప్రతిష్ఠించారు. 600 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు మాట్లాడుతూ గౌసేపాక్ తన తల్లి గర్భంలో ఉండగానే ఖురాన్ షరీఫ్‌ను కంఠస్థం చేసిన మహనీయుడని కొనియాడారు. పేదలతో ప్రేమ భావంతో మెలగాలని, ఆడ పిల్లలకు మంచి చదువు అందించాలని భావించారన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు భాషుమియా, ప్రధాన కార్యదర్శి హుస్సేన్, అయూబ్, దస్తగిరి, అఫ్జల్, సయ్యద్ పాష, షబ్బీర్, అక్బర్ తదితరులు ఉన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న గౌడ సంఘం నేతలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గోనెపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న సీతారాయాంజనేయ దేవాలయ నిర్మాణానికి గౌడ సంఘం సభ్యులు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు ఆ నగదు అందజేశారు. దాతలను కమిటీ సభ్యులు అభినందించారు. ఆలయ నిర్మాణానికి మరింత మంది దాతలు రావాలని కోరారు.

మాయం.. 'హరితహారం'

యథేచ్ఛగా చెట్ల నరికివేత
- విద్యుత్ తీగలకు అడ్డంకి అనే సాకుతోనే..
- కొమ్మలు తొలగించాల్సింది పోయి..
- సొమ్ము చేసుకుంటున్న వ్యాపారి



సగం వరకు చెట్ల నరికివేత

కొమురవెల్లి(సిద్దిపేట): హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతిష్ఠాత్మకంగా నాటిన మొక్కలు ప్రస్తుతం పెరిగి చెట్లుగా ఎదిగాయి. అవి కాస్తా విద్యుత్ తీగలకు తగులుతుండడంతో ఆ శాఖ అధికారులు చెట్లకొమ్మలు నరికివేత మొదలు పెట్టారు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని కిష్టంపేట ఎల్లమ్మ ఆలయం నుంచి కొమురవెల్లి బస్టాండ్ వరకు, అలాగే కొమురవెల్లి ఉన్నత పాఠశాల నుంచి గౌరయపల్లి రోడ్డు వరకు ఉన్న చెట్లను సగానికి నరికేశారు. నిజానికి కొమ్మలు నరకాల్సి ఉంది. అలా చెట్లను నరికివేయడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని రోజులు ఎంతో ఆహ్లాదం పంచిన పచ్చని చెట్లు లేక రోడ్లు బోసిపోయి దర్శనమిస్తున్నాయి. విద్యుత్ అధికారులు చెట్లు నరికే పనిని గ్రామానికి చెందిన కర్ర వ్యాపారికి అప్పగించారు. దీంతో ఆయన తన ఇష్టానుసారం చెట్లు నరికి ట్రాక్టర్‌లో తరలించి సొమ్ము చేసుకుంటున్నాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ లైన్ల కింద తక్కువ ఎత్తు పెరిగే పూల మొక్కలు నాటాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.



సగం వరకు నరికివేసిన హరితహారం మొక్కలు

చెట్ల నరికివేత బాధాకరం



మండల కేంద్రంలో రోడ్ల పక్క ఏపుగా పెరిగిన చెట్లను నరికివేయడం బాధాకరంగా ఉంది. పచ్చని చెట్లు నరికి వేయడంతో రోడ్లు బోసిపోయాయి. ప్రభుత్వం ప్రతిష్ఠత్మకంగా మొక్కలు పెంచితే విద్యుత్ అధికారులు నరికి వేయించడం విచారకరం. ఉన్నతాధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపించాలి.
– ఏర్పుల మహేశ్, గ్రామస్తుడు

కొమ్మలనే తొలగించాలి

విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లు ఏపుగా పెరిగిపోవడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో సంవత్సరానికి రెండు, మూడు సార్లు చెట్ల కొమ్మలు తొలగించవలసి వస్తోంది. చిన్న కొమ్మలను మాత్రమే తొలగించాలని సూచించాం. భవిష్యత్‌లో చెట్లు నరకకుండా చర్యలు తీసుకుంటాం.
– మధు, విద్యుత్ ఏఈ, కొమురవెల్లి

24, 25న రాష్ట్ర 5వ మహాసభలు

సీఐటీయూ జిల్లా నేత భాస్కర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న భాస్కర్ తదితరులు

తొగుట(దుబ్బాక): తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ పిలుపునిచ్చారు. శుక్రవారం తొగుట మండల కేంద్రంలో జీపీ కార్మికులతో కలిసి మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలో 24, 25న 5వ మహాసభలు నిర్వహిస్తామన్నారు. కార్మికులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జీపీ కార్మిక సంఘం నాయకులు నర్సింహులు, మాణిక్యం, స్వామి, నర్సింహులు, పోచయ్య, నర్సయ్య, శంకరయ్య, మల్లేశం, యాదగిరి శ్యామల, యేసేపు, భూదవ్వ తదితరులు పాల్గొన్నారు.

నేటి బీసీ బంద్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి నర్సింహులు యాదవ్

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నేత నర్సింహులు

తొగుట(దుబ్బాక): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి నర్సింహులు యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం తొగుటలో ఆయన మాట్లాడుతూ గత రిజర్వేషన్ల పద్ధతితో నిర్వహిస్తే ఎన్నికలను బహిష్కరిస్తామన్నారు.

కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీసీ జేఏసీ ఇచ్చిన బంద్ పిలుపునకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. శుక్రవారం సిద్దిపేటలో మాట్లాడుతూ శనివారం నిర్వహించనున్న బంద్‌లో కాంగ్రెస్ నాయకులు పాల్గొంటారన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు.

ఆటోడ్రైవర్లకు 'కో-ఆపరేటివ్' అండ



ఆటో కార్మికుల కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ చెక్ అందిస్తున్న హరీశ్‌రావు

- కుటుంబాలకు ఇన్సూరెన్స్ సాయం
- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అండ

సిద్దిపేటజోన్: సిద్దిపేట ఆటో క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీ ఆటోడ్రైవర్ల పాలిట ఆపన్నహస్తంగా మారింది. ఆటోకార్మికుల శ్రేయస్సు కోసం కొన్నేళ్ల క్రితం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రత్యేకంగా సొసైటీ ఏర్పాటు చేయించారు. ఆర్థిక పరమైన సమస్యలు తలెత్తకుండా వారికి భరోసా ఇవ్వాలని తన ఇంటిని బ్యాంకులో తాకట్టుపెట్టి వారికి రుణాలు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించారు. వందలాది ఆటోడ్రైవర్లకు సొసైటీ ఆధ్వర్యంలో ప్రమాద బీమా చెల్లిస్తున్నారు. ప్రమాదవశాత్తు చనిపోయిన వారికి రూ.4 లక్షలు, సహజ మరణానికి రూ.2 లక్షల ఇన్సూరెన్సు చెల్లించేలా సొసైటీ ద్వారా హరీశ్‌రావు అండగా నిలిచారు.

ఇప్పటి వరకు 15 మందికి..

సొసైటీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు 15 మందికి రూ.2 లక్షల చొప్పున రూ.30 లక్షలు బీమా సాయం అందించారు. అదేవిధంగా ఇటీవల ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఒకరికి రూ.4 లక్షల ఆర్థిక సాయం అందేలా సొసైటీ ద్వారా భరోసా కల్పించారు. వివిధ కారణాలతో కుటుంబ పెద్దదిక్కు కోల్పోయిన బాధితులకు 1500 ఆటో కార్మికుల సభ్యత్వం కలిగిన క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీ వినూత్న రీతిలో అండగా నిలిచింది.

సంతృప్తిగా ఉంది

రెక్కాడితే కానీ డొక్కాడనివి ఆటో డ్రైవర్ల కుటుంబాలు. అలాంటి వారికి సొసైటీ ద్వారా అండగా ఉండడం సంతృప్తినిచ్చింది. భవిష్యత్‌లో వారికి మరింత తోడ్పాటు అందిస్తా..
– హరీశ్‌రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే

245 మందికి వైద్య పరీక్షలు

వర్గల్(గజ్వేల్): వర్గల్‌లోని బాగ్‌లింగంపల్లి డాక్టర్ అంబేడ్కర్ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ల పర్యవేక్షణలో నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతమైంది. గ్రామానికి చెందిన దాదాపు 245 మందికి శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి వైద్యులు కార్డియాలజీ, దంత, నేత్ర, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. పలువురు యువకులు, వాలంటీర్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి, ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్, ప్రోగ్రాం ఆఫీసర్ స్వప్న, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పాండు, ప్రత్యేక వైద్యులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అవగాహన అవసరం: ఏసీపీ

గజ్వేల్‌రూరల్: వాహనదారులకు చట్టాలపై అవగాహన కల్పించాలని ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ సూచించారు. గజ్వేల్‌లోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్రమశిక్షణతో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, నిత్యం వాహనాల తనిఖీలు చేపట్టాలని చెప్పారు. అనంతరం ట్రాఫిక్ సీఐ మురళితో కలిసి న్యాయమూర్తి స్వాతిగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

యువత జీవితాలు నాశనం చేసుకోవద్దు

టూటౌన్ సీఐ ఉపేందర్



నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ ఉపేందర్, సిబ్బంది

సిద్దిపేటకమాన్: యువత తాత్కాలిక ఆనందం కోసం తమ జీవితాలు నాశనం చేసుకోవద్దని టూటౌన్ సీఐ ఉపేందర్ సూచించారు. సిద్దిపేటలో పలు అనుమానిత ప్రాంతాల్లో గంజాయి, మత్తు పదార్థాల నివారణ కోసం నార్కోటిక్ డాగ్స్‌తో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు తీసుకున్నా, విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణే విజయానికి తొలిమెట్టు

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



విద్యార్థిని సాహితికి ఆర్థిక సాయం అందిస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రతి విద్యార్థికి క్రమశిక్షణే విజయానికి తొలిమెట్టుగా నిలుస్తుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఇటీవల జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా అండర్ 14 వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని వద్ల సాహితిని శుక్రవారం ఆయన సన్మానించి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. అక్బర్‌పేట–భూంపల్లి మండలం ఖాజీపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సాహితి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజంలో మంచి గౌరవం, గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అంజాగౌడ్, హెచ్‌ఎంలు రాజేందర్, జగన్‌మోహన్‌రాజు, నాయకులు మధు, చిరంజీవి, భిక్షపతి, ఫిజికల్ డైరెక్టర్ నరేశ్, టీచర్లు లక్ష్మీనర్సింహులు, సుముకేశ్వర్‌రెడ్డి, జీవన్‌కుమార్, శ్యామల, స్వామి, పద్మ, ధన్‌రాజ్, మధుసూదన్‌రెడ్డి, దుబ్బరాజయ్య పాల్గొన్నారు.

గవాయిపై దాడి అప్రజాస్వామికం



గజ్వేల్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వివిధ సంఘాల నాయకులు

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ
- తహసీల్దార్ల కార్యాలయాల వద్ద నిరసనలు

హుస్నాబాద్/దుబ్బాక/జగదేవ్‌పూర్(గజ్వేల్)/బెజ్జంకి(సిద్దిపేట)గజ్వేల్‌రూరల్/మిరుదొడ్డి(దుబ్బాక)/కోహెడ(హుస్నాబాద్)/మర్కూక్(గజ్వేల్): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. పలు మండలాల్లో తహసీల్దార్ల కార్యాలయాల వద్ద శుక్రవారం వినతి పత్రాలు అందజేశారు. హుస్నాబాద్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎనగందుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ రుక్మిణికి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ గవాయిపై చేసిన దాడి అప్రజాస్వామికమన్నారు. రాజ్యాంగం మీద జరిగిన దాడేనన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, ప్రకాశ్, థామస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే దుబ్బాకలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముక్కపల్లి రాజు, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు



హుస్నాబాద్‌లో వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీనారాయణ తదితరులు

కనకరాజు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి అంటే దేశంపై జరిగిన దాడేనన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్లజెండాలతో నిరసన తెలిపారు. తహసీల్దార్ సంజీవ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. దాడికి పాల్పడిన నిందితుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎల్లం, జోగయ్య, మహేశ్, జనగామ విజయ్ కుమార్, రమేశ్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్‌లో ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. చీఫ్ జస్టిస్‌పై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో రాజు, కిషన్, కుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు. బెజ్జంకిలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పరశురాములు ఆధ్వర్యంలో నల్ల కండువాలతో ర్యాలీ నిర్వహించారు. గవాయ్‌పై దాడి చేసిన కిషోర్ రాకేశ్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాజు, బాలయ్య, అంజయ్య, భయన్న తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఐఓసీ ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు నిరసన తెలిపారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సీజేఐపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు 27న హైదరాబాద్‌లో దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆంజనేయులు, రాములు, మహేశ్, కృష్ణ, స్వామి, రమేశ్, శ్రీకాంత్, నరేందర్, రాజు, మల్లేశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మిరుదొడ్డిలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కాకి కొండల్ మాట్లాడుతూ గవాయ్‌పై జరిగిన దాడి అనాగరికమన్నారు.మల్లయ్య, రాజు, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు. కోహెడలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు మంద మల్లేశం మాట్లాడారు. సంపత్, శ్యామ్‌కుమార్, రాములు, బాలయ్య, పోచయ్య, అంజయ్య, మురళి పాల్గొన్నారు. మర్కూక్‌లో ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకుడు నర్సింహులు మాట్లాడారు. రాజశేఖర్, అనిల్, కృష్ణ, రాజు, నవీన్, సత్యం, రాములు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలి

అదనపు సీఐ ముత్యంరాజు



జయహాసినిని అభినందిస్తున్న సీఐ

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటి మంచి పేరు తీసుకురావాలని అదనపు సీఐ ముత్యంరాజు సూచించారు. అండర్–17 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన కానిస్టేబుల్ సంతోష్ కూతురు జయహాసినిని శుక్రవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమలో ప్రతిభను చూపేందుకు ఇలాంటి క్రీడాపోటీలు ఎంతో దోహదపడుతాయన్నారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో రాణించి గజ్వేల్‌కు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలెక్కడ?



మొక్కజొన్నను పరిశీలిస్తున్న శ్రీనివాస్ తదితరులు

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు జంగిటి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నకోడూరులో రైతులు ఆరబోసిన మొక్కజొన్నలను శుక్రవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు రాజిరెడ్డి, బాబు, పోశయ్య, మహేందర్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా శనివారం వర్గల్, గజ్వేల్, రాయపోల్ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 వరకు వర్గల్ మండలంలోని నెంటూరు, మాలపల్లి, రాంసాగర్‌పల్లి, మైలారం జబ్బాపూర్, గోవిందాపూర్ తదితర గ్రామాలు; గజ్వేల్ మండలంలోని బంగ్లా వెంకటాపూర్, ముక్తమాసాన్‌పల్లి, కాశగుడిసెలు, ధర్మారెడ్డిపల్లి, రంగంపేట, గిరిపల్లి; రాయపోల్ మండలంలోని బేగంపేట, అప్పాయలపల్లి, ఎల్కల్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

కాలువ పనుల పరిశీలన



కాలువ పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు

కొండపాక(గజ్వేల్): మల్లన్న సాగర్ నుంచి కొండపాక మండలంలోని చెరువులకు సాగునీరు తరలించేందుకు చేపట్టిన కాలువ పెండింగ్ పనులను శుక్రవారం ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు పరిశీలించారు. మల్లన్న సాగర్ నుంచి ప్యాకేజీ 12 (1) ఆర్ డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వారా తొగుట, కొండపాక మండలంలోని పలు గ్రామాలు, సిద్దిపేట రూరల్ మండలంలోని పొన్నాల గ్రామంలోని చెరువులకు నీరందించేలా గత ప్రభుత్వం భూసేకరణ చేసి నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో అక్కడక్కడ కొందరు రైతులు నష్ట పరిహారం విషయంలో ఇతరత్ర కారణాలతో కాలువ తవ్వకం పనులను అడ్డుకోవడంతో నిలిచిపోయాయి. శుక్రవారం రాంపల్లి, దుద్దెడ సరిహద్దు శివారులో ఆగిపోయిన కాలువ పనులను ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) శంకర్‌తో పాటు కొండపాక తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ శంకర్ మాట్లాడుతూ సర్వే మ్యాప్ అలైన్‌మెంట్‌ను మార్చాలన్న రైతుల కోరికను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భూంరెడ్డి, ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ విద్యాసాగర్, ఆర్ఐ బాలకిషన్, సర్వేయర్ గణేశ్, మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరశురాములు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.